సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

సిరులతల్లికి తులసిపూజ



దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వహించే తులసి పూజలో పాల్గొన దలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో రాజేంద్రకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వివేకానంద సంస్థలో ఉచిత వైద్య సేవలు



పరీక్షలు చేస్తున్న డాక్టర్ జహీర్ అహ్మద్

జగదాంబ: జీవీఎంసీ 39వ వార్డులోని స్వామి వివేకానంద సంస్థలో ఉచిత వైద్య సేవలను సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జహీర్ అహ్మద్ నిర్వహించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా జహీర్ అహ్మద్ మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి సంస్థలో వైద్య పరీక్షలు నిర్వహిస్తుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా యాసిన్

దాబాగార్డెన్స్: దక్షిణ నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా మహ్మద్ యాసిన్‌ను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ప్రకటించింది. వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగింది.

అందరి జీవితాల్లో దీపావళి వెలుగులు నింపాలి



దీపావళి ప్రాముఖ్యత వివరిస్తున్న బ్రహ్మకుమారి రామేశ్వరి

దాబాగార్డెన్స్: సర్వ మానవాళి జీవితాల్లో దీపావళి పర్వదినం వెలుగులు నింపాలని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ప్రతినిధి బీకే రామేశ్వరి ఆకాంక్షించారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం జర్నలిస్టుల కోసం ప్రత్యేకంగా దీపావళి వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా రామేశ్వరి దీపావళి పర్వదినం విశిష్టత తెలిపారు. పురాణ ఇతిహాల ద్వారా దీపావళి అనేది ప్రజల జీవన విధానంతో ముడిపడిన వేడుక అని అభివర్ణించారు. 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు, గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపకుడు జేవీ రత్నం, సింహాచలం దేవస్థానం మాజీ సభ్యుడు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, తెలంగాణ క్యాడర్‌కు చెందిన డీఎస్పీ రాము, నాగరాజు పట్నాయక్, బ్రహ్మకుమారీస్ ప్రతినిధి అన్వేష్, పలువురు బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

యువతి వివాహానికి చేయూత



నూతన వస్త్రాలు, ఆర్థిక సాయం అందజేస్తున్న శ్రీదేవి

దాబాగార్డెన్స్: రెల్లివీధిలో నివాసం ఉంటున్న చిన్నారావు మత్స్యకారుడు. ఈ నెల 24న అతని కుమార్తె వివాహం జరిపేందుకు పెద్దలు నిర్ణయించారు. అయితే చేతిలో డబ్బు లేక, కనీసం పెండ్లి కుమార్తెకు దుస్తులు కొనుగోలు చేయలేని పరిస్థితిలో ఆ కుటుంబం తల్లడిల్లుతోంది. చిన్నారావు ఇంటికి సమీపాన ఉన్న ఓ మహిళ ఇచ్చిన సలహాతో శ్రీదేవి చారిటబుల్ ట్రస్ట్‌ను సంప్రదించారు. వారి కష్టాన్ని చెప్పుకున్నారు. అందుకు స్పందించిన ట్రస్ట్ నిర్వాహకురాలు శ్రీదేవి ఆ కుటుంబ పరిస్థితిని తెలుసుకుని చలించిపోయి, పెళ్లికి కావల్సిన పట్టు చీరలు కొనుగోలు చేయడమే గాక రూ.50వేల ఆర్థిక సాయం అందజేసి పెద్ద మనసు చాటుకున్నారు. నేరుగా చిన్నారావు ఇంటికి వెళ్లి సాయం అందివ్వడంతో ఆ కుటుంబంలో ఆనందం చిగురించింది.

వెలుగుల వేడుక

- పలు ఆకృతుల్లో లభిస్తున్న దీపాలు
- నీటితో వెలిగే దీపాలు ఈ ఏడాది ప్రత్యేకం
- పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్న మహిళలు



బ్యాటరీతో వెలిగే దీపాలు

దాబాగార్డెన్స్:

పల్లెలు, పట్టణాల్లో **దీపావళి సందడి మొదలైంది.** ఈ వేడుక కోసం **పిల్లలు, పెద్దలు సమాయత్తమవుతున్నారు.** చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా, చీకటిని పారదోలుతూ వెలుగులు నింపే వేడుకగా దీపావళి జరుపుకుంటాం. ఆశ్వీయుజ మాస అమావాస్య రోజున వచ్చే ఈ పండగకు ఎంతో విశిష్టత ఉంది. దీపావళి రోజు ఏ ఇంటి ముందు దీపాలు సమృద్ధిగా వెలుగుతాయో ఆ ఇంట శ్రీమహాలక్ష్మి ప్రవేశిస్తుందని పెద్దలు చెబుతుంటారు. అందుకే దీపావళి రోజు సాయంత్రం మహిళలు ఇంటి నిండా దీపాలు వెలిగించి మహాలక్ష్మికి పూజ చేసి స్వాగతం పలుకుతారు.

నీటితో వెలిగే దీపాలు..

నూనె లేకుండా నీటితో వెలిగే దీపాలు ఈ ఏడాది స్పెషల్ అని చెప్పాలి. బ్యాటరీ, కరెంట్‌తో అచ్చం నూనె దీపంలా వెలుగులు విరజిమ్మే దీపాలను మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. వీటిని వెలిగించడానికి నూనె అక్కరలేదు, పొగ ఉండదు, గాలి వీస్తే ఆరిపోతుందన్న భయం లేదు. ప్రతి సంవత్సరం వాడుకునే సౌలభ్యం ఉండటంతో బ్యాటరీ, విద్యుత్ దీపాలు, నీటి దీపాలు కొనుకోలు చేయడానికి మహిళలు ఆసక్తి చూపిస్తున్నారు. పలు మోడల్స్‌లో వీటిని విక్రయిస్తున్నారు.

ఆకట్టుకుంటున్న డిజైనర్ ప్రమిదలు..

డిజైనర్ ప్రమిదల పట్ల వినియోగదారులు ఆకర్షితులవుతున్నారు. కోల్‌కతా, చెన్నై నుంచి దిగుమతి చేసుకుని షాపింగ్ మాల్స్, రోడ్డు పక్కన దుకాణాల్లో విక్రయిస్తున్నారు. అలాగే ఆకర్షణీయమైన క్యాండిల్స్, డెకరేటివ్ క్యాండిల్స్ వంటివి కూడా అందుబాటులోకి వచ్చాయి. ఫ్లోటింగ్ క్యాండిల్స్, సెంటెడ్ క్యాండిల్స్, వాటర్ క్యాండిల్స్, బ్యాటరీ క్యాండిల్స్, కుందన్ క్యాండిల్స్, జెల్ క్యాండిల్స్, క్యాండిల్ స్టాండ్స్ వంటివి విక్రయిస్తున్నారు.

అనాది ఆచారం మట్టి ప్రమిదలే..

మట్టి ప్రమిదల్లో ఒత్తులు, నూనె వేసి దీపాలు వెలిగించడం మన సాంప్రదాయం. సాదా ప్రమిదలతో పాటు వివిధ ఆకృతుల్లో ఇప్పుడు ప్రమిదలు లభిస్తున్నాయి. నక్షత్ర దీపాలు, పంచముఖ దీపాలు, దీప స్తంభాలు, ఆకాశ దీపాలు, చిమ్నీ దీపాలు, పింగాణీ దీపాలు ఇలా పలు రకాల మోడల్స్‌లో దీప ప్రమిదలు పూర్ణామార్కెట్, రామకృష్ణా రైతుమార్కెట్, దొండపర్తి తదితర ప్రాంతాల్లో దొరుకుతున్నాయి.



దొండపర్తిలో జోరుగా మట్టి ప్రమిదల విక్రయం



ఆకర్షిస్తున్న దీపాల సెట్



నీటితో వెలిగే దీపాలు



కుందన్ డిజైన్ దీప ప్రమిదలు

దక్షిణం నుంచి తరలిపోయిన సందడి

దీపావళి పండగ వచ్చిందంటే చాలు.. వారం పది రోజుల ముందుగానే నియోజకవర్గానికి పండగ వచ్చేది. మూడు దశాబ్దాల కిందట ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం ప్రహరీకి ఆనుకుని వందకు పైగా స్టాల్స్ ఉండేవి. నగరం విస్తరిస్తున్న నేపథ్యంలో అక్కడ స్టాల్స్‌కు అనుమతి ఇవ్వలేదు. రెండు దశాబ్దాల కిందట నియోజకవర్గ పరిధి ఎల్‌ఐసీ వెనుక భాగంలో స్టాల్స్‌కు అనుమతి ఇచ్చేవారు. ఆ తర్వాత అక్కడి నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం, వైఎస్సార్ పార్కు చుట్టూ స్టాల్స్ ఏర్పాటు చేసేవారు. తర్వాత ఆ సందడి కాస్త తూర్పు నియోజకవర్గానికి వెళ్లింది. ప్రస్తుతం ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ గ్రౌండ్ వేదికగా బాణసంచా విక్రయాలు జరుగుతున్నాయి. దీంతో దక్షిణం సందడి తూర్పుకి తరలిపోయినట్టయింది.



విక్రయానికి ఉంచిన డిజైనర్ దీపాలు

జోరుగా ప్రమిదల అమ్మకాలు..



మట్టితో తయారు చేసిన ప్రమిదలు



ప్లాస్టిక్‌తో తయారు చేసిన ప్రమిదలు

జగదాంబ: దీపావళి నేపథ్యంలో పూర్ణామార్కెట్‌లో ప్రమిదల అమ్మకాలు జోరందుకున్నాయి. రకరకాలుగా తయారు చేసిన ప్రమిదలతో పదుల సంఖ్యలో దుకాణాలు వెలిశాయి. వీటిని పెద్ద ఎత్తున వినియోగదారులు కొనుగోలు చేశారు.

అణగారిన వర్గాలకు ఉచిత న్యాయ సహాయం



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

విశాఖ–లీగల్: పేద, అణగారిన వర్గాలకు ఉచిత న్యాయ సహాయాన్ని మరింత సమర్థవంతంగా అందించడం, న్యాయ సేవలపై ప్రజల్లో అవగాహన కల్పించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్. సన్యాసినాయుడు అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో ప్యానెల్ లాయర్లు, పారా లీగల్ వలంటీర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్ కేసుల పరిష్కారం, న్యాయసేవా పథకాల అమలు, గ్రామ స్థాయి వరకు న్యాయ సహాయాన్ని చేరవేయడంలో అందరి సహకారం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్యానెల్ లాయర్లు, పారా లీగల్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతతోనే సంపూర్ణ రక్షణ



సమాచార శాఖ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న డివిజనల్ పీఆర్‌వో నారాయణరావు



మొక్కలు నాటి నీళ్లు పోస్తున్న జెడ్పీ సీఈవో నారాయణమూర్తి

మహారాణిపేట: స్థానిక సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయ ప్రాంగణంలో శనివారం స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. థీమ్ క్లీన్ ఎయిర్‌కు అనుగుణంగా మొక్కలు నాటారు. వాటికి నీరు పోసి రక్షణ కంచెలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఉన్న మొక్కల వద్ద నీరు నిలిచేలా చుట్టూ గోతులు తవ్వారు. అనంతరం పలువురు వాహన చోదకులకు క్లీన్ ఎయిర్‌పై అవగాహన కల్పించారు. కాలం చెల్లిన వాహనాలు వినియోగించరాదని, వాయు కాలుష్యం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. సమాచార పౌర సంబంధాల శాఖ డీడీ కె. సదారావు, ఇతర అధికారులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డివిజనల్ పీఆర్‌వో నారాయణరావు, ఏపీఆర్‌వో శ్రీనివాసరావు, ఏఐఈ రామకృష్ణ, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్‌లో..

జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణలో సీఈవో పి.నారాయణ మూర్తి ఆధ్వర్యంలో మొక్కలు నాటి నీళ్లు పోశారు. పర్యావరణ హితం కోరుతూ ఉద్యోగులతో కలిసి సైకిల్ తొక్కారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రమైన వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పంచాయతీరాజ్ ఈఈ జీఎస్ఎస్ ప్రసాద్, రూరల్ వాటర్ సప్లై ఈఈ స్టాలిన్, పరిపాలనాధికారులు డి.మంజువాణి, పీవీవీఎస్ మూర్తి, అమ్మాజీ, ఎం.నరసింహమూర్తి, ఎస్. రాజేశ్వరి, ఏపీఎన్‌జీవో సంయుక్త కార్యదర్శి ఎ.మన్మోహన్, పలు విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సైకిల్ తొక్కుతున్న సీఈవో నారాయణమూర్తి, సిబ్బంది

ప్రభుత్వ రంగాన్ని బలహీనపరిచే చర్యలు విడనాడాలి

దాబాగార్డెన్స్: ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర బీజేపీ ప్రభుత్వం, బీజేపీకి మిత్రులుగా ఉన్న రాజకీయ పార్టీలు బలహీనపరిచే చర్యలు తక్షణమే విడనాడాలని, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని సీపీఎం లోక్‌సభ ఫ్లోర్ లీడర్, దళిత సోషణ్ ముక్తి మంచ్ అఖిల భారత అధ్యక్షుడు రాధాకృష్ణన్ డిమాండ్ చేశారు. సిటు అఖిల భారత 18వ మహాసభలు విశాఖలో డిసెంబర్ 31 నుంచి జనవరి 4వరకు నిర్వహించనున్న నేపథ్యంలో సిటు, కేవీపీఎస్ రాష్ట్ర కమిటీలు సంయుక్తంగా శనివారం దాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 'ప్రభుత్వ రంగం–సామాజిక న్యాయం' అనే అంశంపై సదస్సు నిర్వహించాయి. ఈ సదస్సులో రాధాకృష్ణన్ మాట్లాడారు. ప్రభుత్వరంగ సంస్థలు భారత ఆర్థిక వ్యవస్థకు జీవనాడిగా పని చేశాయన్నారు. ప్రైవేట్ రంగం ద్వారానే మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయన్న భ్రమలు నేడు తొలగిపోయాయన్నారు. అయినా కేంద్రంలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం తనకు నచ్చిన వారికి ప్రభుత్వ రంగ సంస్థలు, సహజవనరులు, దేశ సంపద కట్టబెడుతుందన్నారు. ఈ విధానం తగదన్నారు. సదస్సులో సిటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, డీఎస్ఎంఎం అఖిల భారత కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిటు రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు, కార్యదర్శి కె.ధనలక్ష్మి, కేవీపీఎస్ నాయకులు కె.లోకనాథం, ఎం.సుబ్బన్న, టి.చిరంజీవి, వై.రాజు, సిటు జిల్లా అధ్యక్షుడు కేఎం శ్రీనివాసరావు, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాధాకృష్ణన్

ఘనంగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు ప్రారంభం

అల్లిపురం: వెంకటేశ్వర మెట్ట, శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం, శ్రీ గౌరీ సేవా సంఘం సంయుక్తంగా శ్రీ గౌరీ పరమేశ్వరుల లీలా మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు పీలా వెంకటప్పలనాయుడు ఇంటి వద్ద పూజలు చేశారు. అలాగే అమ్మవారి ప్రతి రూపం అయిన వరి దుబ్బుకి కూడా పూజలు జరిపారు.

అనంతరం అమ్మవారిని తిరువీధిగా కెప్టెన్ రామారావు జంక్షన్, అల్లిపురం మెయిన్ రోడ్డు, సింహాలదేవిడి, నేరెళ్ల కోనేరు, బంగారుమెట్ట, నీలమ్మ వేపచెట్టు ప్రాంతాల మీదుగా వెంకటేశ్వరమెట్ట శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పీఠంపై రాత్రి 12 గంటల తర్వాత అమ్మవారిని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయం అధ్యక్ష, కార్యదర్శులు పాలమరశెట్టి వెంకట శ్యామ్‌కుమార్, పాలమరశెట్టి సన్యాసిరాజు మాట్లాడుతూ 77 సంవత్సరాలుగా ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నవంబర్ 15వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు.



తిరువీధి ఉత్సవ దృశ్యం

విశాఖ నీ అడ్డా కాదు చంద్రబాబు?

- మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



మాట్లాడుతున్న వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్: చంద్రబాబు.. విశాఖ నీ అడ్డానా? నీరు, ప్రకృతిని నాశనం చేసే గూగుల్ డేటా సెంటర్‌కు ప్రశాంతమైన విశాఖను అప్పనంగా ధారాదత్తం చేయడానికి ఈ ప్రాంతం నీ జాగీరా? అంటూ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ ధ్వజమెత్తారు. ఆశీల్‌మెట్టలోని తన కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో చంద్రబాబు, నారా లోకేష్‌పై తీవ్రంగా మండిపడ్డారు. ప్రజలను మోసం చేసి, ప్రశాంతమైన విశాఖ నగర వనరులను నాశనం చేస్తే చూస్తూ ఊరుకోమన్నారు. పశ్చిమ దేశాలు తెలివిగా విసిరి కొట్టిన గూగుల్ ఏఐ డేటా సెంటర్‌ను ప్రశాంత విశాఖ నగరానికి తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. విశాఖ నగరానికి రోజుకి 2500 మెగా వాట్స్ విద్యుత్ అవసరమన్నారు. ఈ డేటా సెంటర్‌లో టెక్నికల్‌గా ఎటువంటి సమస్య వచ్చినా ఇతర ప్రాంతాల్లో ఉన్న సిబ్బందితో పరిష్కరించుకుంటారు తప్ప, స్థానిక ఉద్యోగులు ఈ సంస్థకు అవసరం లేదన్నారు. 1.8 లక్షల ఉద్యోగాలను సృష్టిస్తుందని లోకేష్ చెప్పడం పచ్చి అబద్ధమని, దీనిపై శ్వేత పత్రం విడుదల చేయగలరా? అని వాసుపల్లి ప్రశ్నించారు. నిజంగా ఎంత మందికి ఉద్యోగాలు ఇస్తారో గూగుల్ ప్రతినిధి సుందరం పిచ్చయ్యతోనే ప్రకటింపజేయాలని వాసుపల్లి డిమాండ్ చేశారు. నిజంగా లక్షల ఉద్యోగాలు ఇస్తే తాము ప్రాణాలు సైతం అర్పిస్తామన్నారు. పర్యావరణాన్ని పూర్తిగా నాశనం చేసే ఈ సంస్థ వద్దని నిపుణులు మీకు సూచించలేదా? చంద్రబాబు అంటూ వాసుపల్లి సూటిగా ప్రశ్నించారు. ఈ సంస్థ ఏడాదికి 50 కోట్ల కేజీల కార్బన్ డయాక్సైడ్ విడుదల చేస్తుందన్నారు. ఈ పొల్యూషన్ కంట్రోల్ చేయడానికి 60 లక్షల చెట్లు ఉండాలన్నారు. 10 లక్షల కుటుంబాలు కాల్చే కరెంటును ఒక్క డేటా సెంటరే కాలుస్తుందని, అటువంటి ఈ సంస్థకు రాయితీతో కూడిన విద్యుత్, నో రిజిస్ట్రేషన్ ఫీజు, నో జీఎస్టీ, విశాఖ నేల, నీరు అప్పనంగా ధారాదత్తం చేస్తావా చంద్రబాబు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ, పార్టీ నాయకులు సనపల రవీంద్ర భరత్, పచ్చిరపల్లి రాము, ఆరుగుల రాజు, దశమంతుల చిన్ని, ఈతలపాక విజయ్, సర్వేశ్వరరెడ్డి, దశమంతుల మాణిక్యాలరావు, గంగ్ల రామరాజు, గురజాపు రవి, ముజీబ్‌ఖాన్, సాగర్, వాసుపల్లి బంగారమ్మ, దశమంతుల సంతోషి, వేణు, బాలకృష్ణ, శివ, రమ తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలో ఏఎంసీ విద్యార్థుల ప్రతిభ



వైద్య విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు అందజేస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి

మహారాణిపేట: ఆంధ్రా మెడికల్ కాలేజీకి చెందిన ఇద్దరు పీజీ విద్యార్థులు నేషనల్ క్విజ్ పోటీలో విజేతలుగా నిలిచారు. రెండవ సంవత్సరం పీజీ విద్యార్థినులు డాక్టర్ డి. రమ్య, డాక్టర్ ఎ.కాత్యాయిని నేషనల్ క్విజ్ పోటీలో విజేతలుగా నిలిచారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి విజేతలకు మెరిట్ సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలవడం వైద్య విభాగానికి గర్వకారణమని ప్రిన్సిపాల్ కొనియాడారు. ఈ విజయంతో ఆంధ్రా మెడికల్ కాలేజీ, కేజీహెచ్‌కు మంచి పేరు తెచ్చారని పేర్కొన్నారు. డాక్టర్ డి.రమ్య, డాక్టర్ ఎ.కాత్యాయిని అక్టోబర్ 25న జరగనున్న జోన్ స్థాయి పోటీలో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ పిల్లల విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

మరిడిమాంబ జాతరకు వాసుపల్లి విరాళం

దాబాగార్డెన్స్: నియోజకవర్గ పరిధి 30వ వార్డు కోడి పందాల వీధిలో కొలువుదీరిన మరిడిమాంబ జాతరకు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ రూ.10 వేల విరాళం అందజేశారు. సింహాద్రి ప్రసాద్ ద్వారా ఆలయ కమిటీ సభ్యులు సాయం కోరడంతో స్పందించిన వాసుపల్లి తన సొంత నిధులతో ఆ విరాళాన్ని ఆశీల్‌మెట్ట కార్యాలయంలో శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరిడిమాంబ జాతర మహోత్సవం ప్రతి ఏడాది మాదిరిగానే విజయవంతం కావాలని ఆకాంక్షించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని అభిలషించారు. కమిటీ సభ్యులు వాసుపల్లి అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్, పార్టీ నాయకులు ఆరుగుల రాజ్‌కుమార్, కంటుముచ్చు సాగర్, గురజాపు రవి, సూర్యనాయుడు, చేపల నూకరాజు, మరిడిమాంబ ఆలయ కమిటీ సభ్యులు శరగ ఫణి, చంద్రరావు, మొగు, హిరోష్, వీరబ్బాయి తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న వాసుపల్లి

నిరాశ్రయులకు ఆశ్రయం

అల్లిపురం: నవంబర్ 14,15 తేదీల్లో జరగబోయే పార్ట్‌నర్ షిప్ సమ్మిట్‌ను దృష్టిలో పెట్టుకుని ఏయూటీడీ–జీవీఎంసీ షెల్టర్ల సిబ్బంది స్పెషల్ డ్రైవ్‌ద్వారా రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో శనివారం నిరాశ్రయుల గుర్తింపు, షెల్టర్లకు తరలించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గుర్తు తెలియని దివ్యాంగుడు (45), సాలిపేటకు చెందిన ఎస్.దేవరాజు (66), ఎగిలిపాటి గణేష్ (50), శాంతరావు (45), నిమ్మాడకు చెందిన ఒక మహిళ (55)ను రైల్వే పోలీసులతో కలిసి టీఎస్ఆర్ షెల్టర్‌లో పునరావాసం కల్పించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. మానసిక స్థితి బాగాలేని మహిళకు శ్రద్ధా ద్వారా వైద్యం అందిస్తుస్తున్నట్లు చెప్పారు. ఈ రెస్క్యూలో ప్రగడ వాసు, జ్యోతిర్మయి, శ్రీను, లీల, శాంతి, అనసూయ తదితరులు పాల్గొన్నారు.



రెస్క్యూ చేసిన నిరాశ్రయులతో ఏయూటీడీ నిర్వాహకులు

29వ వార్డులో కోటి సంతకాల సేకరణ ప్రారంభం



జిల్లా పరిషత్ జంక్షన్‌లో సంతకాల సేకరణ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

దాబాగార్డెన్స్: శనివారం 29వ వార్డులో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. వార్డు అధ్యక్షుడు పీతల వాసు నేతృత్వంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జిల్లా పరిషత్, కలెక్టర్ ఆఫీస్, కృష్ణానగర్, ఏయూ లేడీస్ హాస్టల్ ఏరియాల్లో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. విద్యార్థులు, వ్యాపారులు, స్థానికుల నుంచి స్పందన వస్తోందని వార్డు అధ్యక్షుడు తెలిపారు. కార్యక్రమంలో కనకల ఈశ్వర్, బెవర మహేష్, బొండాడ వెంకటరమణ, ఎలమంచలి సంతోష్, ఆరుగుల రాజ్‌కుమార్, తమ్మినేని శ్రీనివాస్, కోటా ఆనంద్, పడాల సూర్యకుమార్, సారిపల్లి రమణేశ్వర్, అప్పలరెడ్డి, మాణిక్యాం శ్రీనివాస్, పైబోడి శివ, మేడిశెట్టి రూప, పప్పు కమల, గండివలస పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్‌లో తిజారా ఫెస్ట్-2025



ఫెస్ట్‌లో అతిథులు, అధ్యాపకులతో విద్యార్థినులు

కంచరపాలెం: జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో కామర్స్–మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ ఎస్. జ్యోతి ఆధ్వర్యంలో తిజారా ఫెస్ట్–2025 వేడుకలు జరిగాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, డాక్టర్ పి.కె.జయలక్ష్మి వేడుకలను ప్రారంభించారు. స్టీల్ సిటీ సెక్యూరిటీస్ లిమిటెడ్ నిపుణులు విద్యార్థులకు ఆర్థిక రంగం, మార్కెట్లపై అవగాహన కల్పించారు. విద్యార్థుల ర్యాంప్ వాక్ ఆకట్టుకుంది. గణిత శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కెప్టెన్ కె.సుజాత విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎం.జగదీష్‌కుమార్, ఆర్. పావని, కె.ప్రత్యూష, డాక్టర్ కె.రజని, డాక్టర్ దివ్య జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.